క్లుప్తంగా

సంక్రాంతిలోపు బస్తీ దవాఖానా పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్‌కమిషనర్

రాయికల్‌: పట్టణంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసే బస్తీదవాఖాన పనులను ఈనెల 15లోపు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు మున్సిపల్‌ కమిషనర్‌ గంగుల సంతోష్‌కుమార్‌ సూచించారు. సోమవారం బస్తీ దవాఖానా స్థలాన్ని పరిశీలించి యుద్ధప్రతిపాదికన నిర్మించాలని సూచించారు. ఏఈ ప్రసాద్‌ ఉన్నారు.

ఎంపీ పర్యటన విజయవంతం చేయాలి


యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తిరుపతి

రాయికల్‌: ఈనెల 6న ఎంపీ ధర్మపురి అర్వింద్‌ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు పడాల తిరుపతి కోరారు. సోమవారం మండలంలోని దావన్‌పల్లి, ఖైరిగూడెం, కట్కాపూర్‌ గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతినాయక్‌, మండల కార్యదర్శి నర్సయ్య ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి రవి, బీజేపీ యువమోర్చా ప్రధానకార్యదర్శి సాయిరాజ్‌, నాయకులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు


చెత్త తొలగిస్తున్న యువకులు

రాయికల్‌: మండలంలోని రామాజీపేట ఎస్సారెస్పీ కాలువ చెత్తాచెదారంతో నిండి ఉండడంతో గ్రామానికి చెందిన యువకులు ఎస్సారెస్పీ కాలువలో చెత్తను తొలగించి నీటిని వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం గంగాధర్‌, రవితేజ, రాజు, వసంత్‌, ప్రభాస్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కళోత్సవాల్లో కొడిమ్యాల కళాకారుడు


కళాబృందం సభ్యులతో మహేశ్‌

కొడిమ్యాల: డిసెంబర్‌ 21నుంచి 30వ తేదీ వరకు రాజస్థాన్‌లోని శిల్పాగ్రామ్‌ ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవాల్లో కొడిమ్యాల మండలం కోనాపూర్‌కు చెందిన గుంట మహేశ్‌ పాల్గొన్నారు. బంజార నృత్యం తెలంగాణ సాంప్రదాయ బతుకమ్మ బోనాలు తదితర ప్రదర్శనలు ఇచ్చారు. భారతసాంస్కృతిక మంత్రిత్వ శాఖ వెస్ట్‌జోన్‌ కల్చరల్‌ డైరెక్టర్‌ కిరణ్‌సోని గుప్తా వెంకటేశ్‌కు ప్రశంస పత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పలువురు అభినందించారు.

అటల్‌ స్మారక క్రికెట్‌ టోర్నీ


టోర్నీని ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌

కోరుట్ల: పట్టణంలోని జూనియర్‌ కళాశాల మైదానంలో బీజేపీ నాయకుడు సురభి నవీన్‌కుమార్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాజీ ప్రధాని అటల్‌ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్‌ టోర్నీని సోమవారం బీజేపీ జిల్లా కార్యదర్శి శీలం వేణుగోపాల్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్‌, కౌన్సిలర్లు మాడవేణి నరేశ్‌, పెండెం గణేశ్‌, నాయకులు పీసరి నర్సయ్య, మాసం ప్రసాద్‌, ఆకుల రంజిత్‌, ఇందూరి తిరుమల వాసు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల: పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన సుదర్శన్‌గౌడ్‌ సతీమణి వసంతలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ నిమ్స్‌లో చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కోటి పూజలు


దుంపేటలో శ్రీలక్ష్మీనృసింహస్వామి పల్లకి సేవా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


గోధూర్‌లో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


వాల్గొండ ఆలయ గర్భగుడిలో కొలువుదీరిన శ్రీ రామలింగేశ్వరస్వామి


కోరుట్లలో చైర్‌పర్సన్‌, ఆర్డీవో పూజలు


అంబారిపేట ఆలయంలో జెడ్పీచైర్‌పర్సన్‌ పూజలు


కోరుట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు


రాయికల్‌లో మూలవిరాట్‌ అలంకరణ




పెగడపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


మల్లాపూర్‌ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బీర్‌పూర్‌ ఆలయంలో

జగిత్యాలటౌన్‌/జగిత్యాలరూరల్‌/కోరుట్లటౌన్‌/మెట్‌పల్లి/కొడిమ్యాల/పెగడపల్లి/కథలాపూర్‌/ఇబ్రహీంపట్నం/రాయికల్‌/మల్లాపూర్‌/సారంగాపూర్‌: జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేకువజామున స్వామివారి సేవ ఊరేగింపు చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు.

స్టడీమెటీరియల్‌ పంపిణీ


మెటీరియల్స్‌తో విద్యార్థులు హెచ్‌ఎం, మ్యాథ్స్‌టీచర్‌

కథలాపూర్‌: మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీహైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు గణితం స్టడీ మెటీరియల్‌ ను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. మ్యాథ్స్‌టీచర్‌ రాంప్రసాద్‌ 2023 పబ్లిక్‌ పరీక్షల బ్లూప్రింట్‌కు అనుగుణంగా స్టడీ మెటీరియల్‌ తయారుచేసినట్లు ఆయనపేర్కొన్నారు. 60రోజుల్లో ప్రిపేర్‌ అయ్యేలా రూపొందించామని 25మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశామన్నారు. హెచ్‌ఎం రవీందర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్‌ పట్టివేత


పట్టుకున్న ట్రాక్టర్లతో యువకులు

జగిత్యాలరూరల్‌: మున్సిపల్‌ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో నిత్యం సేకరిస్తున్న చెత్తను డంపింగ్‌ యార్డుకు తరలించకుండా జగిత్యాల అర్బన్‌ మండలం తిప్పన్నపేట గ్రామశివారులో చెత్తను పోస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో గ్రామంలో దుర్వాసన వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం చెత్తను ట్రాక్టర్లలో తెచ్చి పోస్తుండగా యువకులు మున్సిపల్‌ ట్రాక్టర్లను పట్టుకుని గ్రామపంచాయతీ వద్దకు తీసుకెళ్లి నిరసన తెలిపారు. అయినప్పటికీ మున్సిపల్‌ అధికారులు ట్రాక్టర్లను తీసుకెళ్లకపోవడం కొసమెరుపు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లులు చెల్లించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పంచాయతీలకు బకాయిపడిన బిల్లులను చెల్లించాలని బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బకాయిల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడంతో సర్పంచ్‌లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఆందోళనకు సిద్ధమైన కాంగ్రెస్‌ నాయకులను అరెస్ట్‌ చేయడం అప్రజాస్వామికమన్నారు.

'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు


ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న భక్తులు


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయం, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో ప్రసాదం తయారీకి వినియోగించే సామగ్రిపై కరీంనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఆకునూరి సురేశ్‌ సోమవారం జగిత్యాల కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొండగట్టు, ధర్మపురి ఆలయాల్లో ప్రసాదం తయారీకి వినియోగించే సామగ్రి స్థానిక మార్కెట్‌ ధరలకంటే అధిక ధరలు చెల్లిస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు చెందిన టెండర్‌దారులు మినహ తక్కువ ధరలకు ఇతరులు సామగ్రి అందించాలనుకున్నప్పటికీ స్థానికులకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి ఆలయ ఆదాయానికి గండిపడకుండా చూడాలని నిబంధనల ప్రకారం కాకుండా స్థానికులకు అవకాశం కల్పించేందుకు టెండర్లు పిలవాలని వినతిపత్రంలో కోరారు. కూనవేని రాజశేఖర్‌, బొయిని గంగాధర్‌, గాజుల విక్రమ్‌ ఫిర్యాదు పత్రం అందించారు.

ఆలయ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొండగట్టు అంజన్న ఆలయానికి మంగళవారం స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌, కరీంనగర్‌ మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ రానున్నారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ సోమవారం సాయంత్రం ఏర్పాట్లను పర్యవేక్షించారు. శానిటైజేషన్‌ సరిగ్గా లేకపోవడం లిఫ్ట్‌ పనిచేయకపోవడం మెట్లదారి పనులు ప్రారంభించకపోవడంతో ఆలయ ఈవో టి.వెంకటేశ్‌ ఇతర అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ


క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న ముత్యంరెడ్డి

రాయికల్‌: భూపతిపూర్‌ సహకార సంఘం నూతన క్యాలెండర్‌ను సోమవారం చైర్మన్‌ ఏనుగు ముత్యం రెడ్డి ఆవిష్కరించారు.భూపతిపూర్‌ సర్పంచ్‌ జక్కుల చంద్రశేఖర్‌, ఉపసర్పంచ్‌ అన్నవేని వేణు వైస్‌ చైర్మన్‌ నాగుల మల్లయ్యగౌడ్‌, సంఘ డైరెక్టర్లు నేతుల లక్ష్మీ నారాయణ, కొమ్ము గంగరాజం, మల్యాల జలపతి రెడ్డి, సంఘ కార్యదర్శి చంద్రశేఖర్‌ సిబ్బంది రాజేశ్‌, రంజిత్‌, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మేడిపెల్లి: మండలకేంద్రంలో సోమవారం 2023 నూతన క్యాలెండర్‌ను జెడ్పీ వైస్‌చైర్మన్‌ హరిచరణ్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, సర్పంచ్‌లు నారాయణరెడ్డి, అభిలాశ్‌, కేడీసీసీ డైరెక్టర్‌ రమేశ్‌ రెడ్డి, పలువురు బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

గృహనిర్బంధంతో గొంతు నొక్కలేరు


జీవన్‌రెడ్డిని పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కోరుట్లరూరల్‌: రాష్ట్రప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను గృహనిర్బంధాలు చేసినప్పటికీ వారిగొంతు నొక్కలేరని టీపీసీసీ నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. సర్పంచుల హక్కుల కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద టీపీసీసీ చేపడుతున్న నిరసన కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని జగిత్యాలలో హౌజ్‌ అరెస్టు చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. జీవన్‌రెడ్డిని సోమవారం జగిత్యాలలో పరామర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీసీసెల్‌ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌ గౌడ్‌, సీనియర్‌ నాయకులు ఎర్దండి మోహన్‌రెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు మారు శ్రీనివాస్‌రెడ్డి, రహమాన్‌, తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి


విరాళం అందిస్తున్న నిషాంత్‌ కార్తికేయ

మల్లాపూర్‌: యువత సన్మార్గంలో పయనించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పూదరి నిషాంత్‌ కార్తికేయ అన్నారు. సోమవారం మల్లాపూర్‌ మండలంలోని వీవీరావుపేటలో పీఈటీ నర్సింగంసార్‌ స్పోర్ట్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహించే ఐదు రాష్ట్రాల వాలీబాల్‌ టోర్నీకి రూ.20వేలు విరాళం అందించారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని, విద్యార్థులు చదవుతో పాటుక్రీడల్లో రాణించాలని సూచించారు. వీవీరావుపేట వంటిమారుమూల గ్రామాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిట్ల నరేశ్‌, స్పోర్ట్స్‌క్లబ్‌ అధ్యక్షుడు మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, పోతు గోపి, సలహాదారుడు మచ్చర్ల దశరెడ్డి, నాయకులు రాజేందర్‌, లవంగ శివకుమార్‌, ఆర్మూర్‌ రంజిత్‌ పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌



ప్రమాదకరంగా ప్రయాణం

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కూలీలను ఇతర మండలాలు, గ్రామాలకు యాసంగి వరినాట్లు వేసేందుకు ఆటోలు, ట్రాలీల్లో ఇలా తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, సామగ్రికి బదులు మనుషులను తరలిస్తున్నారు. ఇలా వీరిని తరలించే క్రమంలో అనుకోకుండా ఏదైన ప్రమాదం జరిగితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరగకముందే పోలీస్‌, ఆర్టీఏ అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: కొక్కుల శ్వేత, ఎస్సై, పెగడపల్లి
ఫోన్‌ నంబర్‌: 94407 95286



దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: హిందు దేవతలను కించపరిచిన నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం మండలంలోని వేములకుర్తిలో గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి శివాజీ విగ్రహం వద్ద నరేశ్‌ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈమేరకు గ్రామస్తులు మాట్లాడుతూ.. హిందువుల మనోభవాలను దెబ్బతీసేలా హిందువుల కొలిచే దేవుళ్ల గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సున్నం సత్యం, కోటగిరి ప్రభాకర్‌, మాలేపు శ్రీనివాస్‌, ఎడపెల్లి గంగారెడ్డి, గుజ్జె గంగాధర్‌, పుప్పాల సాయికుమార్‌, గుమ్మల గణపతి, లొక సురేశ్‌, పుప్పాల లక్ష్మణ్‌, కోట రామానుజం, అశోక్‌, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

జగిత్యాల: మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ మరమ్మతులు చేపడుతుండడంతో మల్యాల, కొడిమ్యాల, బోయినిపల్లి, గంగాధర, చొప్పదండి మండలాల్లోని గ్రామాలతో పాటు చొప్పదండి మున్సిపల్‌లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, 3వతేదీన అంతరాయం ఉంటుందని, 4వ తేదీన పునరుద్ధరిస్తామని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ వేములవాడ లక్ష్మణ్‌కుమార్‌ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీలు

కొడిమ్యాల: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 15 నుంచి 29 మధ్య వయస్సు గల యువతీ, యువకులకు జానపద పాటలు, జానపద నృత్యపోటీలను నిర్వహిస్తున్నట్లు యువజన సంఘాల సమితి జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కోట మధుసూధన్‌ తెలిపారు. ఈనెల 4న జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9704061725 సంప్రదించాలన్నారు.



మల్యాల అడ్డరోడ్డుతో అవస్థలు

- రోడ్డుపైనే నిలుపుతున్న బస్సులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన

మల్యాల: జగిత్యాల-కరీంనగర్‌ జాతీయ రహదారిపై మల్యాల అడ్డరోడ్డు వద్ద నిలబడాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. జగిత్యాల నుంచి కరీంనగర్‌ వైపు వెళ్లే బస్సులు రోడ్డుపై నిలుపుతుండడంతో ఇటు ప్రయాణికులు అటు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. పక్కనే బస్టాప్‌ ఉన్నప్పటికీ బస్సులు నిలపడం లేదు. దీనికితోడు బస్టాపు పునర్నిర్మాణం చేపడుతుండడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఈక్రమంలో జగిత్యాల నుంచి కరీంనగర్‌ వైపు వెళ్లే వాహనాలు బస్సు వెనకాలే నిలిచిపోతున్నాయి. దీంతో మల్యాల నుంచి కరీంనగర్‌ వెళ్లే వాహనదారులూ ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఎటు నుంచి ఏ వాహనం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

పౌష్టికాహారం పంపిణీ



మల్లాపూర్‌: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం శకుంతలదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్‌ శంకర్‌ అన్నారు. ట్రస్ట్‌ జిల్లా ఇంచార్జీ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.